క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



కాటారం: మండలంలోని దామెరకుంట కు చెందిన జంజర్ల రంజిత్ డిస్క్ సమస్యతో బాధపడుతూ గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండటంతో కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి రూ.1.75 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి ఆస్పత్రి సహాయకుడు రంజిత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్ఓసీ మంజూరు చేయించి అండగా నిలిచిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రేగులగూడెం ఏఈఓగా అస్మా



కాటారం: మండలంలోని రేగులగూడెం క్లస్టర్ వ్యవసాయశాఖ విస్తరణాధికారి(ఏఈఓ)గా అస్మా నియమితులయ్యారు. ఈ మేరకు అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ బి.గోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహాముత్తారం మండలం బోర్లగూడెం క్లస్టర్ ఏఈఓగా పని చేస్తున్న అస్మా సాధారణ బదిలీల్లో భాగంగా రేగులగూడెం బదిలీ కాగా ఇక్కడ పని చేస్తున్న శరత్ ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయినట్లు తెలిసింది.

'కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు'

చిట్యాల: మాజీ మంత్రి కేటీఆర్ మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరైనవి కావని వెంటనే క్షమాపణ చెప్పాలని కోరుతూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవిసత్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్స్‌లు, రికార్డింగ్‌లు వేసుకోవచ్చు అంటూ మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మండల కమిటీ ఎన్నిక



సాగర్‌రావు, అధ్యక్షుడు

మల్హర్: ఫర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ మండల కమిటీని మండలంలోని కొయ్యూరులో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పమ్మిడి సాగర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా పగడాల గట్టయ్య, తోగరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తాళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ రమేశ్‌రెడ్డి, కోశాధికారిగా అల్లాడి సురేష్, సమాచార, సంయుక్త కార్యదర్శిగా బుర్ర సుధాకర్‌లను నియమించారు.

నియామకం



నర్సయ్య, అధ్యక్షుడు

వెంకటాపురం(ఎం): రేషన్ డీలర్ల సంఘం మండల కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో డీలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనుకుంట్ల నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా సోమిడి కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా బానోతు రమ, కార్యదర్శులుగా విజయశ్రీ, దేవేందర్, గౌరవ అధ్యక్షుడిగా గువ్వ రామస్వామి ఎన్నికయ్యారు.

పరామర్శ



గోవిందరావుపేట: మండలంలోని మోట్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుర్సం కన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ శుక్రవారం పరామర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సాయంతో రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

ముగ్గురి రిమాండ్

ఏటూరునాగారం: హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4న రాత్రి సమయంలో ఎడం సారమ్మ, ఏనక సరిత, ఎడం శివ నాగరాజు కలిసి వారి దగ్గరి బంధువైన గావిడి రాములును కర్రతో తీవ్రంగా కొట్టగా రాములు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఈనెల 10న మృతి చెందాడు. కాగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా రాములకు మూడు ఎకరాల భూమి ఉందని అతడిని చంపితే ముగ్గురు పంచుకోవచ్చు అనే ఉద్దేశంతో చంపడానికి ప్రయత్నించినట్లు తేలిందన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. సీఐ వెంట ఎస్సై తాజొద్దీన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



మల్హర్: పూజలు చేస్తున్న మహిళలు



టేకుమట్లలో..

మల్హర్: మండలంలోని గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని తాడిచర్ల వేంకటేశ్వర ఆలయంలో, పెద్దమ్మతల్లి ఆలయం, మల్లారం హనుమాన్ దేవాలయంలో అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో సామూహిక వ్రతాలు చేశారు.

కాటారం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించుకున్నారు. అమ్మవారిని ఇళ్లలో ప్రతిష్ఠించుకొని అందంగా అలంకరించారు. తీరొక్క నైవేద్యాలు సమర్పించి మొక్కులు సమర్పించారు. కుటుంబమంతా సుఖసంతోషాలతో ఉండి సౌభాగ్యాలు కలగాని అమ్మవారిని వేడుకున్నారు. పసుపు, కుంకుమ, తాంబూలం వాయినంగా ఇచ్చి పుచ్చుకున్నారు. అనంతరం స్థానిక ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.

టేకుమట్ల: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, శ్రీ భక్తాంజనేయ దేవాలయ కమిటీ భక్త బృందం ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను సామూహికంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పూజిస్తే వరలక్ష్మీ అమ్మవారి కరుణ కటాక్షం అనుగ్రహం చేకూరుతుందని భక్తాంజనేయ ఆలయ పూజారి వల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు దాసరి రాజయ్య, పురోహితులు శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ టేకుమట్ల మండల ప్రఖండ కదం రాజేశ్వర్‌రావు, రామకృష్ణ, నల్ల సునీతరెడ్డి, చదువు మధుర పాల్గొన్నారు.

మంగపేట/వెంకటాపురం(ఎం): : మండలంలోని పలు గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహ ప్రతిమను బంగారు ఆభరణాలు, నగదు పూలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారి వద్ద పవిత్ర కలశాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన పులిహోర, పూర్ణం తదితర పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. ఒకరి నుంచి ఒకరు ఆశీర్వాదం స్వీకరించారు. దీంతో యా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయాన్నే పుణ్యస్నానాలచరించి వరలక్ష్మీని అలంకరించి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. వెంకటాపురంలోని రామాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు రఘునాథచార్యులు ఆధ్వర్యంలో వ్రతాన్ని నిర్వహించారు.



వెంకటాపురం(ఎం): వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్న మహిళలు



మంగపేట: రాజుపేటలో..

మానవత్వం చాటుకున్న సీఐ



శ్రీకాంత్‌కు చికిత్స చేయిస్తున్న సీఐ నాగార్జునరావు

కాటారం: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని సరైన సమయంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు స్థానిక సీఐ నాగార్జునరావు. వివరాల్లోకి వెళ్తే.. మహదేవపూర్ మండలానికి చెందిన అంగజాల శ్రీకాంత్ కాటారం–మంథని ప్రధాన రహదారి నిర్మాణ పనుల్లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి కాటారం నుంచి మహదేవపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో అటవీ ప్రాంతంలో అదుపు తప్పి పడిపోయాడు. శ్రీకాంత్ తీవ్రగాయాలపాలై సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ సమయంలో విధి నిర్వహణలో భాగంగా మహదేవపూర్ వైపుగా వెళ్తున్న సీఐ నాగార్జునరావు శ్రీకాంత్‌ను గమనించి తన వాహనంలో ఎక్కించుకొని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దగ్గర ఉండి చికిత్స చేయించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి తరుణ్

మంగపేట: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి తరుణ్ అన్నారు. మండలంలోని చెరుపల్లి పల్లె దవాఖాన వైద్యాధికారి తరుణ్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ, బెస్తగూడెం కాలనీల్లో వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులతో పాటు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఇద్దరు జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఆయా కాలనీల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మమత, ఆశా వర్కర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడుదాం..



పరామర్శిస్తున్న నాయకులు

ములుగు రూరల్: కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పని చేసిన అమరుల స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడుదామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండబోయిన రవిగౌడ్ అన్నారు. శుక్రవారం గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమరుల యాదిలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన పొన్నం భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించారు. గీత కార్మికుల కుటుంబాలకు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు సరైన పత్రాలు ఉండాలి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: ప్రతీ వాహనదారుడు వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలన్నారు. వాహనదారులు సరైన పత్రాలు ఆధారాలు లేకుండా వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మగ్గం శిక్షణ సందర్శన

మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ, ఎస్‌బీఐ స్వయం ఉపాధి ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని ఎస్సై తాజొద్దీన్ పరిశీలించారు. 70 మంది మహిళలకు ఒక్కొక్కరికీ మగ్గం మిషన్లు కొనుగోలు చేసేందుకు రూ.500ల సాయం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫొటో స్టూడియోలో చోరీ



సీసీ కెమెరాలలో రికార్డయిన వ్యక్తి

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామంలోని ఫొటో స్టూడియోలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చల్వాయి గ్రామంలో చిన్ని ఫొటో స్టూడియోలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.10 వేలు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు చేయగా శుక్రవారం సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. షాప్‌లోని సీసీ కెమెరాలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి ఫొటోలు నమోదు అయ్యాయని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు



నైన్‌పాక శివారులో బోల్తా పడిన కారు

చిట్యాల: కాళేశ్వరం దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసుల కథనం ప్రకారం.. టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్(వీ) గ్రామానికి చెందిన సందేసరి రమేశ్, సందేసరి శ్రీనాథ్, అఖిల్, వీరక్కలు కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి కారులో వెళ్లి వస్తుండగా చిట్యాల మండలంలోని నైన్‌పాక గ్రామ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ఉన్న నలుగురికి గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులతో పాటు సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ క్షతగాత్రులను స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణంలో మంగపేట ఎంజేపీ విద్యార్థులు పరిమితికి మించి ఉండడం వలన అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని దళిత సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులను పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, నాయకులు విజయ్, క్రాంతికుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి, కాశిందేవిపేట సబ్ స్టేషన్ పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు సరఫరా నిలిపివేయబడుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

గోవిందరావుపేట: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డ్రగ్స్‌ని తరిమి కొడదాం–యువతను కాపాడుదాం అనే వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని యువతకు నేడు (శనివారం) వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నామని అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడలకు యువత ఉదయం 09 గంటలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అవకతవకలపై విచారణ చేయాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రుణాల మంజూరు, నిధుల వినియోగంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని పీఏసీఎస్ డైరెక్టర్లు కోరారు. ఈ మేరకు డైరెక్టర్లు నత్తి సుధాకర్, కంచ సతీశ్, రేవూరి జయ్‌పాల్‌రెడ్డి, దుగ్యాల శ్రీను, ఓరుగంటి గోవర్ధన్‌రెడ్డి పలువురు రైతులు నోడల్ అధికారి విజయ్‌భాస్కర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ రుణాల మంజూరు చేసేందుకు రైతుల నుంచి నగదు తీసుకున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు.

అసంపూర్తిగా రహదారి నిర్మాణం



బురదరోడ్డుపై దిగబడిన ట్రాక్టర్

వాజేడు: వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్య ఉన్న కొంగాల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జికి ఇరువైపులా రహదారి పనులను పూర్తి చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఆ పనులను చేయకపోడంతో రహదారి బురదమయంగా మారింది. బురదలో నుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో వాహనాలు దిగిబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రేగొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలలైన సంఘటన మండలంలోని భాగిర్థిపేట శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం ఉడిపిరాల గ్రామానికి చెందిన శ్రీపతి ఉపేంద్ర చారి బంధువులతో కలిసి కాళేశ్వరం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో భాగిర్థిపేట శివారులో మూత్ర విసర్జన కోసం వాహనం ఆపి రోడ్డు దాటుతుండగా మైలారం గ్రామానికి చెందిన బుర్ర కుమారస్వామి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఉపేంద్రచారి కాళ్లు విరగగా.. కుమారస్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్సై సందీప్ కుమార్ వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి ఘనసన్మానం



రాజేందర్ సన్మానిస్తున్న గోపాల్, తదితరులు

నర్సంపేట : ప్యారిస్‌లో టెక్నికల్ అఫీషియల్‌గా ఎన్నికైన సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్‌ను పట్టణంలోని షటిల్ ప్లే గ్రౌండ్‌లో స్థానిక డివిజన్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి సిద్దోజు లక్ష్మణచారి మాట్లాడారు. ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ప్యారిస్‌లో జరగనున్న పారా ఒలింపిక్స్–2024కు రాజేందర్ టెక్నికల్ అఫీషియల్ షటిల్ ప్లేయర్ తొలిసారిగా ఎన్నికయ్యారని చెప్పారు. రాజేందర్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌కు ప్రాధాన్యత ఉందన్నారు. సైనా నెహ్వాల్, సింధు, శ్రీకాంత్, సాత్విక్, సాయిరాజ్, సిక్కిరెడ్డి లాంటి తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ప్రపంచ వేదికలపై సత్తా చాటుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గోపాల్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, జాతీయ క్రీడాకారులు హర్షియా, సునీల్, రాజు, బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, సీనియర్ క్రీడాకారులు ఆడెపు సదానందం, సుదర్శన్‌రెడ్డి, తిరుపతి, సుశాంత్, తేజ, షఫీ, అహ్మద్, మోహన్, రాకేష్, ప్రశాంత్, రంజిత్, నితీష్, శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రదానం

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన ఇరువురు విద్యార్థులు ఇంటర్, పదోతరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా శుక్రవారం కృపా సంస్థ ద్వారా నగదు పురస్కారాలు అందించారు. ఇంటర్మీడియేట్‌లో పోతుల వరుణ్ సాయి 985 మార్కులు సాధించగా, పదోతరగతిలో కంచం స్రవంతి 9.8జీపీఏ సాధించారు. దీంతో ఇరువురు విద్యార్థులకు రూ. 4వేల నగదు పురస్కారం అందించి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. నాయకులు సామల మధుసూదన్, గుర్రం రవీందర్, తోట కుమారస్వామి, కట్ల మోహన్‌రెడ్డి, కృపా సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసెకు మంటలు



బాధితులతో మాట్లాడుతున్న కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

హన్మకొండ (పరకాల) : ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పూరి గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొలుగూరి కుమారస్వామి కుటుంబ సభ్యులు కూలి పనికి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుడిసెలో మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు, సర్టిఫికెట్స్ పూర్తిగా కాలపోయాయి. కట్టుబట్టలతో కుమారస్వామి కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని బాధితుడు తెలిపాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ పరంగా సాయం అందిచేందుకు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

మహిళల్లో ప్రతిభ వెలికితీసేలా పోటీలు

నర్సంపేట : మహిళల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఆటల పోటీలు దోహదపడతాయని ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) రీనా తెలిపారు. పట్టణంలో ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మగ్గం శిక్షణ పొందుతున్న ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన మహిళలకు ఆమె శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రీనా మాట్లాడారు. మగ్గం శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ సంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, కన్జ్యూమర్ ఫోరమ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు నాగెల్లి సారంగం గౌడ్, గండి యాదగిరి, ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, స్వచ్ఛంద వలంటీర్లు మొగిలిచర్ల రాముసేవక్, వెంకన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.